క్లుప్తంగా

చేతుల శుభ్రతతో ఆరోగ్య భద్రత


చేతుల శుభ్రత కార్యక్రమంలో మహిళలు

నాగులుప్పలపాడు: చేతుల శుభ్రతతోనే ఆరోగ్య భద్రత ఉందని డీపీఎం నరశింహారావు తెలిపారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేతుల శుభ్రతపై మహిళలకు మంగళవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కుటుంబానికి మహిళల ఆవశ్యకత, కుటుంబ రక్షణకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు చేతులను శుభ్రపరిచే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం బత్తుల నరేంద్రకుమార్, సీసీలు కృష్ణ, రమణమ్మ, కవిత, అరుణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలు విగ్రహానికి స్థలం కేటాయించాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మద్దాళి

చీమకుర్తి: సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేసేందుకు కావాలసిన స్థలం కేటాయించాలని అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు మున్సిపల్ చైర్మన్ వై.రామకృష్ణయ్యకు వినతి పత్రం అందించారు. మంగళవారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి చంద్రకు విజ్ఞప్తి చేశారు. పోలీస్ స్టేషన్ సమీపంలో స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయ వ్యవస్థలో మహిళలకు సమాన హక్కులు


మాట్లాడుతున్న న్యాయవాది ధనలక్ష్మి

నాగులుప్పలపాడు: న్యాయ వ్యవస్థలో మహిళలకు సమాన హక్కులు ఉన్నాయని, వాటిని గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ న్యాయవాది ఎస్.ధనలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొన్నారు. న్యాయవాది ధనలక్ష్మి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక దోపిడీ గురించి వివరించారు. వాటి నివారణ కోసం యాజమాన్యాలు ఏర్పాటు చేయాల్సిన సంఘాలు, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మహిళలకు అందించే ఉచిత న్యాయ సాయం గురించి వివరించారు. డీపీఎం నరశింహారావు, ఎంపీడీవో మహాలక్ష్మి, ఏపీఎం నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.


భాగ్యనగర్ 4వ లైను ముఖద్వారం


భాగ్యనగర్ 4వ లైను రోడ్డు దుస్థితి


రోడ్డుపై గుంతలు.. ట్రాఫిక్‌కు గేదెల అడ్డంకి

పేరులో భాగ్యం.. వసతులు మృగ్యం

- దుస్థితిలో నగరంలోని భాగ్యనగర్ నాలుగో లైను
- నగరం నుంచి బైపాస్‌కు వెళ్లే ప్రధాన మార్గం ఇదే..
- అయినా అధ్వానంగా రోడ్డు
- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కాలేజీలకూ ఇదే దారి
- వర్షం కురిస్తే బురదమయం

ఒంగోలు అర్బన్:

నగరంలోని భాగ్యనగర్ 4వ లైను రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు ఉండటంతో వర్షం కురిస్తే రోడ్డుపైనే వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. అలాగే ఈ రోడ్డులో నిరంతరం పైపు లైన్‌ల మరమ్మతులు, అండర్ గ్రౌండ్ కేబుల్స్ రిపేర్లు అంటూ రోడ్డును తవ్వి రోజుల తరబడి ఆ గుంతలు పూడ్చడంలేదు. ఇలాంటి సమయంలో ఈ రోడ్డు నుంచి నడిచి వెళ్లాలన్నా వీలుకావడం లేదు. ఇంత జరుగుతున్నా పట్టించుకునే వారే కానరావడంలేదు.

ఈ ప్రధాన మార్గానికి అనుసంధానంగా ఉన్న పలు అడ్డ రోడ్లలో పలు ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కాలేజీలు కూడా ఉండటంతో నిత్యం వేలాది వాహనాలు ఆ రోడ్డు ద్వారా రాకపోకలు సాగిస్తున్నాయి. ఆర్‌టీఓ, ఏసీబీ, ఈవీఎం గోదాములు వెళ్లేందుకు కూడా ఇదే మార్గం. పలు సార్లు కలెక్టర్ సైతం అదే రోడ్డులో ఈవీఎం గోడౌన్, కేంద్రీయ విద్యాలయం ఇతర ప్రభుత్వ కార్యాలయాకు వెళుతుంటారు. రోడ్డు పరిస్థితి గమనించారో లేదో కానీ రోడ్డుకు మాత్రం మోక్షం లభించడం లేదు. అంతేకాకుండా నగరంలో నుంచి పాత బైపాస్‌కు వెళ్లేందుకు ప్రధానమార్గం కూడా ఇదే. అంటే మామిడిపాలెం మీదుగా లాయర్‌పేట వైపు వెళ్లేందుకు ఈ రోడ్డు షార్ట్‌కట్‌గా ఉంటుంది. అలాగే అదే రోడ్డులో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్దకు నిత్యం వేలాది మంది వాకర్లు వెళుతుంటారు. అయితే ఈ రోడ్డు పూర్తిగా గుంతల మయం కావడంతో వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, కార్పొరేషన్ అధికారులు స్పందించి భాగ్యనగర్ 4వ లైను రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. కనీసం మరమ్మతులు చేపట్టి వర్షాల సమయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని పోతున్నారు.


మరమ్మతుల పేరుతో మార్జిన్లలో తీసిన గుంతలు


నడి రోడ్డుపై ఇలా అడ్డంకి

నీట మునిగిన పొలాలు


నిండు కుండలా ఉప్పుగుండూరు చెరువు


రెండు చెరువులు నిండి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

నాగులుప్పలపాడు: తుఫాన్ ప్రభావం దృష్ట్యా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని చెరువులు, కుంటలు నీటితో నిండి పొంగి పొర్లుతున్నాయి. వాగులు పొర్లి చేలల్లో నీరు ప్రవహిస్తుండటంతో పంటలన్నీ నీటమునిగాయి. ఉప్పుగుండూరు గ్రామంలోని రెండు చెరువులు నిండి నీళ్లు రోడ్లపై పొర్లాయి. నాగన్నవాగు పొంగి పొర్లడంతో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు నిలిపివేసి పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నారు.


అగ్రహారం పొలాల్లో నీట మునిగిన మిరప పంట

వర్షపు నీరు నిలబడకుండా చర్యలు

ఒంగోలు సబర్బన్: నగరంలో వర్షపు నీరు లోతట్టు ప్రాంతాల్లో నిలబడకుండా వేగవంతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మంగళవారం నగరంలోని పోతురాజు కాలువతో పాటు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావును ఆదేశించారు. నీరు నిల్వకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కొప్పోలు రోడ్డులోని జర్నలిస్టు కాలనీ 1వ లైను పరిశీలించారు. 5 పునరావాస కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించామని సోమవారం నుంచి ఆ ప్రాంత ప్రజలకు భోజన వసతులు కల్పిస్తామని చెప్పారు. నగర మేయర్ జి.సుజాత, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.


పోతురాజు కాలువ పరిసరాల్లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

అభయాంజనేయ స్వామికి ఆకు పూజ


ప్రత్యేక అలంకరణలో పంచముఖ ఆంజనేయ స్వామి


తమలపాకుల అలంకరణలో వీరాంజనేయ స్వామి

ఒంగోలు మెట్రో: నగరంలో ఆంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారి జన్మ నక్షత్రం పురస్కరించుకొని అభిషేకాలు, అర్చన పూజాక్రతులను వైభవంగా నిర్వహించారు. స్థానిక లాయర్ పేట రైతు బజార్ దగ్గర ఉన్న చిట్టి ఆంజనేయస్వామికి, కేశవ స్వామి పేటలోని వీరాంజనేయ స్వామి, మంగమూరు రోడ్డు ఐశ్వర్య నగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామికి ఆకు పూజ, స్వామికి ప్రీతికరమైన సింధూరంతో అర్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు సేకరించి అభయాంజనేయ స్వామి ఆశీస్సులను అందుకున్నారు.

వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

చీమకుర్తి రూరల్: రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఐ.వెంకటేష్ సూచించారు. రిలయన్స్ ఫౌండేషన్, కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను చీమకుర్తి మండల పరిధిలోని తొర్రగుడిపాడు, యర్రగుడిపాడు, పడమటి నాయుడుపాలెం గ్రామాలకు చెందిన రైతులతో మంగళవారం నిర్వహించిన మల్టీ లొకేషన్ ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్త మాట్లాడారు. వరి పంటలో జీవన ఎరువుల వాడకం, ఉల్లికోడు, నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.యాకోబు, పి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.




ముదిగొండి వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

ముదిగొండి వాగు పరిశీలన

మద్దిపాడు: మండలంలో ప్రవహిస్తున్న ముదిగొండి వాగును తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంపీడీఓ వి.జ్యోతి మంగళవారం ఉదయం సందర్శించారు. తుఫాన్ నేపథ్యంలో భారీగా వర్షాలు పడటంతో ముదిగొండి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వాగు నేలటూరు, గురవారెడ్డిపాలె కొష్టాల సెంటర్, పెదకొత్తపల్లి గ్రామాల వెంట ప్రవహిస్తూ ఉన్న నేపథ్యంలో వాగులోకి ఉధృతంగా నీరు వస్తోందని, ఆయా మార్గాల్లో ఎవరూ ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ నుంచి నాగులుప్పలపాడు వెళ్లే దారిలో ఉన్న నేల చప్టాలను పరిశీలించి అక్కడ కూడా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు అధికారులు స్పష్టం చేశారు.

ఉద్యాన పంటల్లో రైతులు జాగ్రత్తలు పాటించాలి

నాగులుప్పలపాడు: ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలతో రైతులు ఉద్యాన పంటల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖాధికారి ప్రత్యూష సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మాచవరం, రాపర్ల గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. మిపర పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపించాలని, వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలు పంటపై పిచికారీ చేయాలన్నారు. అనంతరం అంతర సేద్యం చేసి నేల ఆరేటట్లు చూసుకోవాలని తెలిపారు. పొలంలో నీరు నిలిస్తే ఎండు తెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు కాపరాక్సీ క్లోరైడ్ లీటరుకు 3 గ్రా లేదా మేటలక్సిల్‌తో పాటు మంకాజెట్ లీటరుకు 2 గ్రాములును మొక్కల మెదట్లో పోయాలని సూచించారు. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం వలన ఆకుమచ్చ తెగులు, బూజు తెగులు ఆశించే అవకాశం ఉందని, ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బండజిమ్ లీ. కు 1 గ్రా..లేదా మంకోజెట్ లీ. కు 2 గ్రా. ల చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకట్రావు, రైతులు ఉన్నారు.


రాపర్లలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

